
ప్రజాశక్తి
శుక్రవారం 17 అక్టోబర్ 2025 5 విజయనగరం



లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

ప్రజాశక్తి-బొబ్బిలి

అనుమతులు లేని లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆర్‌డి చామంతి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఈనెల 23 వరకు మాత్రమే గడువు ఉందని చెప్పారు. బొబ్బిలి మున్సిపాలిటీలో అనుమతులు లేని లేఅవుట్లు 91 ఉన్నాయని, ఇప్పటి వరకు 79 క్రమబద్ధీకరణ చేశామని తెలిపారు. 14 ప్రాసెస్‌లో ఉన్నాయని, మిగిలిన 7 దరఖాస్తు చేయాల్సి ఉందని చెప్పారు. ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకుంటే 14 శాతం చెల్లించాల్సిన ఫీజులో సగం చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. 50 చదరపు మీటర్లలోపు ఇంట్లి నిర్మాణానికి ఒక్క రూపాయి చెల్లిస్తే అన్ని అనుమతులు ఇస్తామన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలో ఇప్పటి వరకు మూడు దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

దుర్వాసన.. పంటలు నాశనం

మండలంలోని పాతబగ్గాం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన కోళ్లఫారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోళ్ల ఫారం నుంచి వచ్చిన దుర్గంధంతో ప్రజలు అనారోగ్యం బారిన పడడమే కాకుండా పంటలు సైతం నాశనమవుతున్నాయని రైతులు, పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక పోవడంతో వ్యర్థాలు పక్కనే ఉన్న పంట పొలాలను, సాగు భూములను నాశనం చేస్తున్నాయని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని, పంటలను కాపాడాలని పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పంట పొలాల్లోకి చేరిన కోళ్ల వ్యర్థాలు

- కోళ్ల ఫారంతో ప్రజలు, రైతులకు ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్

ప్రజాశక్తి - గజపతినగరం

15ఏళ్ల క్రితం విశాఖ ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త పాతబగ్గాం సమీపంలో కోళ్ల ఫారం ఏర్పాటు చేశారు. రోడ్డుకు 200 మీటర్ల దూరంలో నిర్మించాల్సిన కోళ్ల ఫారంను నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుకు అడుగు దూరంలోనే నిర్మించారు. నిబంధనలు పాటించకపోవడం వల్ల తీవ్ర దుర్వాసన, భూగర్భ జలాల కాలుష్యం తో పాటు ఈగలు సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులను కలసి ఫిర్యాదులు చేశారు. గ్రీవెన్సులో కలెక్టర్‌కు సైతం వినతులు అందజేశారు. అయినా స్పందన లేదు. కోళ్లఫారంలో కోళ్ల వ్యర్థాలను సరిగ్గా తొలగించకపోవడంతో పేరుకుపోయి చుట్టుపక్కల గ్రామాలకు సైతం తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో ప్రమాదకరమైన శ్వాసకోస వ్యాధులు, ఉబ్బసం వంటి వ్యాధులకు గురవుతున్నారు. మరోవైపు వ్యర్థాలతో పంటలు సైతం నాశనమవుతున్నాయని రైతులు అంటున్నారు. వర్షాలకు, వర్షపు నీరు, కోళ్ల ఫారం నుంచి వ్యర్థాలతో పాటు నేరుగా పంట పొలాల్లో ప్రవేశించి భూగర్భ జలాలు కలుషితమై పంటలు పోతున్నాయని రైతులు వాపోతున్నారు.

షెడ్ల నిర్మాణాలపై పలు అనుమానాలు

15ఏళ్ల క్రితం అప్పటి వైద్యఆరోగ్యశాఖ నుంచి అనుమతులు తీసుకున్నప్పటికీ ఒకే షెడ్ నిర్మించాలని అనుమతి ఇచ్చినట్లు సమాచారం. అయితే వ్యాపారం ప్రారంభించిన రెండు సంవత్సరాల్లో మరో షెడ్ నిర్మించారు. ప్రస్తుతం మరో రెండు షెడ్లు నిర్మించారు. దీంతో దుర్గంధం మరింత ఎక్కువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోళ్ల ఫారం నిర్మాణానికి గ్రామ సమీపంలో ఏ విధంగా అనుమతులు ఇచ్చారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

యాంటీబయాటిక్స్ అధిక వాడకం!

నిబంధనలకు మించి అధిక మోతాదులో యాంటీబయోటిక్స్ వాడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. మాంసం, గుడ్లు కలుషితమై ప్రజల ఆరోగ్యానికి హాని కలిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నారు.

పంటలకు తీవ్ర నష్టం

చుట్టుపక్కల పంటలు పండించే రైతులు పంట కోత సమయానికి కోళ్ల ఫారం ద్వారా ప్రాణాంతక బ్యాక్టీరియాలు, ఈగలు పంటపై చేరి, వాటిని తినేస్తూ, పంటను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగల ప్రభావం ఎక్కువగా మామిడి పంటపై అధికంగా చూపించడంతో తీవ్ర నష్టం చూడాల్సిన పరిస్థితి వస్తుందని పాతబగ్గాం గ్రామానికి చెందిన పలువురు మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోళ్లఫాం ఇదే

ఫిర్యాదులు అందలేదు

ప్రజలు కోళ్ల ఫారం వల్ల కలిగే ఇబ్బందులను తమ దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కోళ్ల ఫారం యజమానులు నిబంధనలు పాటించాల్సిందే.

- అవినాష్, పశువైద్యాధికారి, మరుపల్లి

ప్రజారోగ్యానికి హాని కలిగించకూడదు

కోళ్ల ఫారం సరైన నిబంధనలు పాటించకుండా సమీప గ్రామ ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే విధంగా వ్యవహరిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించకూడదు.

-సాయి కృష్ణారెడ్డి, పిహెచ్‌సి వైద్యాధికారి, మరుపల్లి

విచారణ చేస్తాం

కోళ్ల ఫారం డ్రైనేజీ, వ్యర్థాలు వల్ల సమీప గ్రామ ప్రజలకు కలిగే ఇబ్బందులపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. శానిటేషన్ విషయంలో సంబంధిత పంచాయతీ సెక్రటరీ ద్వారా నోటీసులు అందజేస్తాం.

- బి.కల్యాణి, ఎంపిడిఒ

సుజల స్రవంతి భూ సేకరణ వేగవంతం

కలెక్టర్ రామసుందర్ రెడ్డి



ప్రాజెక్టు మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి అన్నారు. అందుకు గాను జిల్లా లో 50 కోట్లు నిధులు ఉన్నాయని, మొత్తం ప్రాజెక్ట్‌కు గాను భూసేకరణకు అవసరమైన నిధులు కోసం ప్రభుత్వానికి నివేదించడానికి సమగ్ర నివేదిక అందించాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు. జిల్లాలో నీటిపారుదల రంగం లో చేపట్టిన తోటపల్లి, నారాయణపురం, తారకరామ తీర్థసాగర్, మడ్డువలస, తాటిపూడి, ఆంధ్ర ప్రాజెక్ట్ లపై జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి నీటిపారుదల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశం లో చీఫ్ ఇంజనీర్, తోటపల్లి ప్రాజెక్టు ఇంఛార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ స్వర్ణకుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా నీటిపారుదల ప్రాజెక్ట్ ల స్థితిగతులను, పురోగతిని కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్ట్ లో గజపతినగరం బ్రాంచ్ కెనాల్‌కు అవసరమైన భూసేకరణ సత్వరం పూర్తిచేయాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్ట్‌లకు అనుబంధంగా 759 ఎంఐ ట్యాంకులు ఉన్నాయని, జిల్లాలో ఆర్‌ఆర్‌ఆర్ లో భాగంగా చెరువుల పనులు, 40 చెక్ డామ్‌ల పనులు ఉపాధి హామీ పథకం కింద 8.6 కోట్ల అంచనా వ్యయంతో జరుగుతున్నాయని అధికారులు కలెక్టర్ కు వివరించారు. సమావేశం లో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ స్వర్ణ కుమార్, ఎస్ఇలు ఆర్.అప్పారావు, సుధాకర్ ఇఇలు అప్పలనాయుడు, రమణ పాల్గొన్నారు

శిథిలావస్థలో రెగ్యులేటర్లు

పట్టని అధికారులు



రెగ్యులేటర్లు శిథిలావస్థకు చేరడంతో కిందికి వెళ్లిపోతున్న నీరు

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని మంతిన సమీపంలో ఉన్న నారాయణపురం కుడి ప్రధాన కాలువపై 50 ఏళ్ల పూర్తి చేసుకున్న రెగ్యులేటర్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. రెగ్యులేటర్ పూర్తిగా చెదలు పట్టి పూర్తిగా పాడైన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులేటర్ పూర్తిగా పాడైపోవడంతో మంతిన, మల్లయ్యపేట, బూరాడపేట, తదితర గ్రామాల పరిధిలోని వందలాది ఎకరాలకు సక్రమంగా సాగునీరు అందటం లేదని రైతులు వాపోతున్నారు. తక్షణమే నూతన రెగ్యులేటర్ ఏర్పాటు చెయ్యాలని రైతన్నలు కోరుతున్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడే వారి

భరతం పట్టాలి

ఎస్‌పి ఎఆర్ దామోదర్



మాట్లాడుతున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

మహిళల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలని, లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నేర సమీక్షా సమావేశం జరిగింది. దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎన్‌డిపిఎస్, పోక్సో, అట్రాసిటీ, మిస్సింగు, రోడ్డు ప్రమాద కేసులను, లాంగ్ పెండింగు కేసులను సమీక్షించారు. ఎస్‌పి మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న కేసులను సంబంధిత సిఐలు, డిఎస్పీలు తరుచూ సమీక్షించి, దర్యాప్తు అధికారులకు తగిన సూచనలను చేయాలన్నారు. మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని, స్మార్ట్ పోలీసింగు చేయాలన్నారు. నేరస్థులు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారి పట్ల, గంజాయి వ్యాపారులతో కఠినంగా వ్యవహరించాలన్నారు. గ్రేవ్ కేసులను నిర్దిష్ట సమయంలోగా దర్యాప్తు పూర్తి చేసి, నిందితులపై అభియోగ పత్రాలు దాఖలు చేయాలన్నారు. బెల్టుషాపుల ద్వారా అనధికార మద్యం విక్రయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. తాత్కాలిక అనుమతులు (లైసెన్సు) కలిగిన వ్యాపారులను బాణసంచా విక్రయాలకు అనుమతించాలని తెలిపారు. బాణసంచా లైసెన్సులు కలిగి, భద్రత ప్రమాణాలు పాటించే గోడౌన్లులోనే భద్రపర్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో గంజాయి సేవించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు, పలువురు సిఐలు, వివిధ పోలీసు స్టేషనుల్లో ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనులు పూర్తిచేయాలి

మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస



మెడికల్ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక బృందం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి క చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస కోరారు. గురువారం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణాన్ని నిర్మాణ జరుగుతున్న తీరును ప్రజాసంఘాల ప్రతినిధిఉల బృందం పరిశీలించింది. ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్ రూములను నిర్మాణ ప్రదేశాలను పరిశీలించారు అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బి.దేవి మాధవిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస మాట్లాడుతూ ప్రభుత్వ సరోజన ఆస్పత్రిని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలిస్తే అన్ని విభాగాల సంబంధించిన వైద్యాన్ని ఒకే చోట అందించడం జరుగుతుందన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకట రావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల వద్దకు ఉదయం, సాయంత్రం వేళలో కొన్ని బస్సులను నడిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల వద్దకు వెళ్లేందుకు డబుల్ రోడ్డు ను నిర్మించాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని కోరారు .కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-గంట్యాడ

కలెక్టరేట్ వద్ద శుక్రవారం చేపట్టే ఆటో, క్యాబ్ డ్రైవర్ల ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ కోరారు. గురువారం కొటారుబిల్లి జంక్షన్, బుడతనాపల్లి, తామరాపల్లి జంక్షన్, బోనంగి ఆటో స్టాండ్లలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఉచిత బస్సు పథకం వల్ల ఆటో, క్యాబ్ డ్రైవర్లు 60 శాతంపైన ఆదాయం కోల్పోతున్నారన్నారు. కార్మిక సంఘాల ఆందోళన, అభ్యర్థలను పట్టించుకోకుండా డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అచ్యుతాపురం వద్ద ప్రయివేటు ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేసి, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ 21ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బంగారు నాయుడు, దేవుడు, అప్పలరాజు, ఎర్నాయుడు, రాజు, సతీష్, వెంకట్రావు, అప్పారావు, పండు, రమణ, తదితరులు పాల్గొన్నారు .

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలపై ఈ గ్రీవెన్స్‌లో దరఖాస్తులను అందజేయవచ్చునని తెలిపారు. అలాగే గత నెలలో జరిగిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్లో వినతి పత్రాలను అందజేసిన ఉద్యోగులు సైతం నేడు జరిగే గ్రీవెన్స్ కు హాజరై, తమ అర్జీపై అధికారులు తీసుకున్న చర్యలను సైతం తెలుసుకోవచ్చునని సూచించారు.

నేడు, రేపు మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో 17,18 తేదీల్లో రెండు రోజులు పాటు మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహిస్తామని డిఇఒ యు.మాణిక్యం నాయుడు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి తెలిపారు. గురువారం మండల స్థాయి క్రీడా పోటీలు షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. రెండు రోజుల పాటు అన్ని మండలాల్లో క్రీడాపోటీలు పూర్తయిన తర్వాత జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలు విజయవంతమయ్యేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

జిఎస్‌టిపై అవగాహన ర్యాలీ




ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిఎస్‌టి శ్లాబులను రెండుకు తగ్గించడం వల్ల అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అన్నారు. సూపర్ జిఎస్‌టి..సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా.. ప్రాంతీయ రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ వాహన ర్యాలీని కలెక్టరేట్ వద్ద గురువారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి ఆర్ అండ్ బి జంక్షన్, సంతకాల వంతెన, ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా బాలాజీ జంక్షన్ వరకు జరిగింది. మోటార్ సైకిల్ నుంచి కార్లు, వ్యాన్లు, ట్రాక్టర్ల వరకు అన్ని రకాల వాహనాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. ర్యాలీలో ఫ్ల కార్డులను ప్రదర్శించి, జిఎస్‌టి 2.0పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేథు మాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, జిఎస్‌టి జాయింట్ కమిషనర్ నిర్మలాజ్యోతి, ఉప రవాణాధికారి డి.మణికుమార్, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగలక్ష్మి, ఆర్టీవో విమల, సీనియర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు దుర్గాప్రసాద్, మురళీకృష్ణ, రవిశంకర ప్రసాద్, శివరాంగోపాల్, పలువురు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూములు తిరిగి ఇవ్వాల్సిందే

ఆర్‌డిఒ వద్ద స్పష్టంచేసిన డొంకినవలస రైతులు



ఆర్‌డిఒకు వినతి అందిస్తున్న రైతులు

ప్రజాశక్తి-బాడంగి

జ్యూట్‌మిల్లు ఏర్పాటు కోసం 45 ఏళ్ల క్రితం సేకరించిన భూమిని తమకు తిరిగివ్వాల్సిందేనని డొంకినవలస రైతులు.. ఆర్‌డిఒ రామ్మోహనరావుకు తేల్చిచెప్పారు. ఇటీవల కలెక్టరేట్‌లో డొంకినవలస రైతులు చేసిన ఫిర్యాదు మేరకు గురువారం ఆర్‌డిఒ గ్రామంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 1980లో మహవీర్ కంపెనీ పేరిట జ్యూట్‌మిల్లు కడతామని సుమారు 32 ఎకరాలను సేకరించి, నేటికీ ఏర్పాటు చేయలేదని చెప్పారు. జ్యూట్‌మిల్లులో ఉద్యోగాలిస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అక్కడ ఎలాంటి పనులూ చేపట్టక పోవడంతో నిబంధనల ప్రకారం ఆ పొలాలు రైతులకే చెందాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. ఆ భూములు తిరిగి తమకు అప్పగించాలని ఆర్‌డిఒను కోరుతూ వినతి అందించారు.

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు జివి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజి అనస్తీషియా విభాగం ఆధ్వర్యాన సిపిఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జెఎన్‌టియు జివి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు మాట్లాడుతూ మనిషి ప్రమాద స్థితిలో ఉన్నప్పుడు సిపిఆర్ ఏవిధంగా ఉపయోగ పడుతుందో వీరు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మణికుమార్, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ బి.ధర్మారావు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ సెంటర్‌లో జిఎస్‌టి సరికాదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆటో, లారీ, టాటా మేజిక్ వాహనాలకు ప్రైవేటు ఫిట్నెస్ సెంటర్‌లో జిఎస్‌టి వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి (ఎ ఐఎఫ్‌టియు) రెడ్డి నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అసలే బేరాలు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో జిఎస్‌టి వేయడం మూలిగే నక్కపై తాటి కాయ పడ్డ చందంగా వుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్

రుణాల చెల్లింపులో ఆదర్శంగా నిలవాలి

డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రతి మహిళా సంఘం సమయానికి రుణాలు చెల్లించడంలో ఆదర్శంగా నిలవాలని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి అన్నారు. గంట్యాడ వెలుగు కార్యాలయంలో గురువారం జరిగిన మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సమాఖ్యలు గ్రామీణ అభివృద్ధిలో ప్రధాని భూమిక పోషిస్తున్నాయని చెప్పారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించడమే కాదు కుటుంబ ఆర్థిక స్థిరత్వానికి మూల స్తంభాలుగా నిలుస్తున్నారని చెప్పారు. స్త్రీనిధి, సిఐఎఫ్, పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ వంటి పథకాలను సక్రమంగా వినియోగించడం ద్వారా గ్రామీణ మహిళలు తమ జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగు పరుచుకోవచ్చని తెలిపారు. డిజిటల్ లావాదేవీల ద్వారా పారదర్శక ఆర్థిక వ్యవస్థను నెలకొల్పాలన్నారు. ఈ సమావేశంలో ఎపిడి సావిత్రి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చిరంజీవి, ఎపిఎం కె.సులోచనదేవి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల మార్పుపై చర్య తీసుకోండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు గత 15ఏళ్లగా స్టేట్ బ్యాంకు నుండి జీతాలు పొందుతూ వ్యక్తిగత రుణాలు పొందారని, వారి అకౌంట్లను యాక్సిస్ బ్యాంకుకు మార్చుకోవాలని అధికారులు చెప్పడంతో ఆ నిబంధనలు తెలియక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఎఐటియుసి నాయకులు రంగరాజు, కామేష్ తెలిపారు. ఈమేరకు కమిషనర్‌కు, ఎంహెచ్‌ఒకు వినతి అందజేశారు. పారిశుధ్య కార్మికుల్లో చాలా మంది నిరక్షరాస్యులు వున్నందున యాక్సిస్ బ్యాంక్ నిబంధనలు కార్మికులకు తెలియక ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'పై బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివి వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పై రెండు వారాల ప్రభుత్వ అధికారుల శిక్షణా కార్యక్రమం బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని జెఎన్‌టియుజివి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చెన్నై, కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. కార్యక్రమం ఈనెల 27 నుండి నవంబర్ 7 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో నిర్వహిస్తారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, విశ్వవిద్యాలయ డైరెక్టర్లు ప్రొఫెసర్ జి. స్వామినాయుడు, ప్రొఫెసర్ కె.సి.బి.రావు, ప్రొఫెసర్ కలేశా వలి తదితరులు పాల్గొన్నారు.

వనంగుడి ఆదాయం రూ.12,52,606

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి వనంగుడి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. రూ. .12,52.606 నగదు వచ్చింది. ఆలయ సహాయ కమిషనర్ కె. శిరీష కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యాన సిబ్బంది ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దారుణం


మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి - గజపతినగరం, దత్తిరాజేరు

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేసేందుకు చూడటం దారుణమని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం గజపతినగరంలోని వైసిపి కార్యాలయంలో, దత్తిరాజేరులోని మహాదేవ్ ఫణీంద్ర నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. వైద్య కళాశాలలను కాపాడుకునేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని కోరారు. సంతకాల సేకరణలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశాల్లో ఎంపిపిలు బెల్లాన జ్ఞానదీపిక, సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసిలు గౌర తవుడు, రౌతు రాజేశ్వరి, వైసిపి మండలాధ్యక్షులు బూడి వెంకటరావు, రాపాక కృష్ణార్జున, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, మాజీ ఎంపిపి కంది తిరుపతి నాయుడు, నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కరణం ఆదినారాయణ, రెడ్డి పద్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య



రూ.20వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు కోట్ల రఘు

అన్నదానానికి సాయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పేరాపురం గ్రామంలో ఉన్న శివశక్తి భ్రమరాంభ మల్లికార్జున పీఠం వద్ద జరుగుతున్న అన్నదాన కార్యక్రమం నిమిత్తం కొవ్వాడ సర్పంచ్, జనసేన నాయకులు కోట్ల రఘు గురువారం రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ, గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక సేవలకు తోడ్పాటు అందించడం తన ధర్మంగా భావిస్తున్నానని చెప్పారు. ఇలాంటి పుణ్యకార్యాల్లో భాగమవ్వడం తనకు ఆనందంగా ఉందన్నారు. ఆధ్యాత్మికత మనసుకు శాంతిని, సమాజానికి స్ఫూర్తిని ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోరాడ మహేష్, గురు స్వామి, పాండ్రంకి బంగారు నాయుడు, వలిరెడ్డి తమ్ముడు తదితరులు పాల్గొన్నారు

గ్రంథాలయ సందర్శన

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ సభ్యులు ఆర్. రామమూర్తి నాయుడు విజయనగరం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని గురువారం పరిశీలించారు. సిబ్బంది వివరములు, గ్రంథాలయ పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఉన్న గ్రంథాలయాలన్నింటినీ బాగు చేయిస్తామని, బకాయి పడిన గ్రంథాలయ పన్ను సకాలంలో వసూలు అయ్యేలా చర్య తీసుకొంటామని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి జిల్లాలో శిధిలావస్థలో ఉన్న గ్రంథాలయాల వివరాలు తెలిపారు.

ఉపాధి కూలీలకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి- రేగిడి

ఉపాధి కూలీలకు ఇకెవైసి తప్పనిసరి చేయాలని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ అన్నారు. అప్పాపురం, అంబఖండి గ్రామాల్లో కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్వహిస్తున్న ఇకెవైసిని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలందరికీ ఇకెవైసి చేయించాలన్నారు. ఆధార్ కార్డు, జాబ్ కార్డుతో ఫీల్డ్ అసిస్టెంట్ వద్దకు వెళితే ఇకెవైసి చేస్తారన్నారు. మండలంలో 27,080 ఉపాధి శ్రామికులు ఉన్నారని, ఇప్పటి వరకు 18,054 మంది ఇకెవైసి చేయించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీధర్ ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

రాజపాత్రునిపాలెంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని రాజపాత్రునిపాలెం గ్రామంలో లయన్స్ క్లబ్, జీసస్ మిరియన్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు తెన్నేటి సుబ్బారావు, వివి రాజు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో మందుల షాపుల యాజమానుల సంఘం అధ్యక్షులు వెల్లకోట సతీష్, శ్రీహరి, నాయకులు లెంక శ్రీను, రామన్న పాత్రుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ

ప్రజాశక్తి-వేపాడ

విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు జి.వి.సూర్యనారాయణ, చంద్రకళ.. మారిక పాఠశాలకు రూ.7 వేలు విలువైన మెగాఫోన్‌ను వితరణగా అందించారు. వారికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

దత్తిరాజేరులో టిడిపి నుంచి 10 కుటుంబాలు గురువారం వైసిపిలో చేరాయి. పువ్వల శ్రీనివాసరావు, తదితరులు వైసిపిలో చేరగా, వారికి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అప్పలనర్సయ్య మాట్లాడుతూ 16 నెలలకే టిడిపి కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం, నాయకుల పనితీరు సరిగా లేదని చెప్పారు.

విఆర్‌ఒపై సర్పంచ్ ఫిర్యాదు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కందివలస విఆర్‌ఒ కె.రామునాయుడు పై ఆ గ్రామ సర్పంచ్ దేశెట్టి గణేష్ గురువారం తహశీల్దార్ ఎన్‌వి రమణకు ఫిర్యాదు చేశారు. విఆర్‌ఒ బర్త్ సర్టిఫికెట్ కోసం మూడు నెలలుగా తిప్పుతున్నాడని చెప్పారు. తాము అప్లై చేసిన సర్టిఫికెట్ ఆర్‌డిఒ కార్యాలయానికి పంపించకుండా తన వద్ద అట్టిపెట్టుకొని తిప్పుతున్నాడన్నారు. నెలరోజుల క్రితం అడిగితే ఆర్‌డిఒ ఆఫీసుకు పంపించేశామని సమాధానం చెప్పాడని, ఇప్పుడు మళ్లీ అడిగితే మా దరఖాస్తు ఇంకా ఆయన వద్దే ఉందని చెబుతున్నాడని అన్నారు. ఈ విషయంపై స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ విఆర్‌ఒ ప్రవర్తన, పని తీరుపై పలుమార్లు హెచ్చరించినా మారకపోవడం విచారకరమన్నారు. ఆయన సక్రమంగా పనిచేయకపోతే పై అధికారులకు తెలియజేస్తానన్నారు. విఆర్‌ఒతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటానని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

నేడు, రేపు ఎస్‌జిఎఫ్ పోటీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

డాక్టర్ వరలక్ష్మి పాఠశాలలో శుక్ర, శనివారాల్లో ఎస్‌జిఎఫ్ మండల స్థాయి ఎంపిక పోటీలను అండర్-14, 17 విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు మండల క్రీడా కోఆర్డినేటర్ ఎస్.ధార్రాజు తెలిపారు. బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొత్తవలస : ప్రగతి కళాశాలలో శుక్ర, శనివారాల్లో ఎస్‌జిఎఫ్ మండల స్థాయి ఎంపిక పోటీలను అండర్-14, 17 విభాగాల్లో నిర్వహిస్తున్నారు. క్రీడా పోటీల్లో కొత్తవలస మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- మెరకముడిదాం

స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల స్థాయి సైన్స్ సెమినార్ ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మశ్రీ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మేలైన సాంకేతికతను అందించే శాస్త్రవేత్తలు గా అబివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మొదటి బహుమతిని గర్భాం మోడల్ స్కూలు విద్యార్థి ఎం.దుర్గాప్రసాద్, ద్వితీయ బహుమతిని బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎ.జక్షితా గెలిపొందారు. వీరుజిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల మరియు ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్లష్టర్ రిసోర్స్ టీచర్స్, సిఆర్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమరాజు మృతికి మంత్రి సంతాపం

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని చంద్రంపేట గెడ్డ వద్ద గల్లంతైన విజ్జపు సోమరాజు మృతి పట్ల రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంతాపాన్ని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో విజయనగరం నుంచి బొడ్డవర వెళ్లే మార్గంలోని చంద్రంపేట కాజ్ వేని దాటే ప్రయత్నంలో రెండురోజుల క్రితం ఆర్ వసంత గ్రామానికి చెందిన విజ్జపు సోమరాజు గల్లంతైన విషయం తెలిసిందే. ఆయన మృతదేహం గురువారం లభ్యమైంది. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాస్ ఈ సంఘటన జరిగిన నేపథ్యాన్ని, బాధితుడి కుటుంబ వివరాలు గ్రామస్థులకు ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు సోమరాజు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున అందాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శృంగవరపుకోట



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం లక్కవరపుకోట ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యవంతమైన మహిళ.. శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాదని అన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పారావు, ఐసిడిఎస్ పిఒ భాగ్యలక్ష్మి, డాక్టర్ అనిల్ కుమార్, సర్పంచ్ కెర్రు పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలో ఎన్‌జిఒ భవనంలో పోషణ మాసోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ రాజేశ్వరి, ఎంపిడిఒ కళ్యాణి మాట్లాడారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. చిరుధాన్యాలు, పోషక పదార్థాలు ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శకుంతల, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

గంట్యాడ : జంగ్ ఫుడ్‌కు దూరంగా ఉండి పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి అన్నారు. వసాది అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బోనంగి సెక్టార్ సూపర్‌వైజర్ గాయత్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలాన్ని బట్టి ఆహారపు అలవాటును మార్చుకోవాలని అన్నారు. జంగ్ ఫుడ్ వల్ల అనారోగ్యానికి గురవుతారని అన్నారు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్యామల సాయి మాట్లాడుతూ గర్భిణులు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి అలివేలు మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి అవతారం, సూపర్‌వైజరు శాంతిలత, అనురాధ, కృష్ణవేణి, గ్రామ పెద్దలు గణపతి, కె.శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబానికి మహిళ పునాది

చీపురుపల్లి : ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి పునాదిగా ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో 8వ రాష్ట్రీయ పౌష్టికాహార మహోత్సవాల ముగింపు వేడుకలు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పి.నాగమణి ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతీ మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం శక్తివంతంగా తయారవుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారాన్ని తల్లులు వినియోగించు కోవాలన్నారు. చీపురుపల్లి ప్రాజెక్టు పరిధిలో 16 మిని అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, వెల్ బేబీ షోలో విజేతలు అయిన పిల్లలకు బహుమతులు ప్రదానం చేసారు. టిడిపి మండల అధ్యక్షులు రౌతు కామునాయుడు, ఆర్‌ఇసియస్ మాజీ చైర్మెన్ దన్నాన రామచంద్రుడు, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, టిడిపి టౌన్ పార్టీ అధ్యక్షులు గవిడి నాగరాజు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముల్లు వెంకటరమణ, మెరకముడిదాం మాజీ ఎంపిపి కోట్ల మోతీలాల్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు



పౌష్టికాహార ప్రదర్శనలను తిలకిస్తున్న రామ్ మల్లిక్‌నాయుడు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-బొబ్బిలి



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు

పట్టణం లో అభివృద్ధి పనులకు గురు వారం మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు శంకుస్థాపన చేశారు. రత్నాల నగర్‌లో రూ.5 లక్షలతో సిసి రోడ్డు, కాలువ, రాజుల సందులో రూ.1.50 లక్షలతో పైపులైన్, బొప్పడాపువీధిలో రూ.4.45 లక్షలతో సిసి రోడ్డు, గౌడవీధిలో రూ.3 లక్షలతో కాలువ, జంగాలవీధిలో రూ.4.95 లక్షలతో కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శరత్‌ను కౌన్సిలర్లు బి. శ్రీదేవి, బి. దమయంతి సన్మానించారు. కమిషనర్ రామలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని రాజా కళాశాల మైదానం, మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో తొలగించాలని ఆదేశించారు. మార్కెట్లో వ్యాపారులు చెత్త బయట వేయకుండా పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, సిబ్బంది ఉన్నారు.

సిజెఐపై దాడి అమానుషం

ప్రజాశక్తి-రామభద్రపురం

సిజెఐ గవాయ్‌పై జరిగిన దాడి అమానుష చర్యని అంబేద్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సోరు సాంబయ్య ఖండించారు. ఈ మేరకు గురువారం అంబేద్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీ చేస్తూ 3 రోడ్ల కూడలి వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గోపాలరావు, రామస్వామి, ఈశ్వరరావు, తవుడు, లోకేష్ పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరంకోట

మండలంలోని రాకోడు, పినవేమలి రైతులు వరిలో చీడ,పీడల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యాన గురువారం అవగాహన కల్పించారు. పొలం బడిలో భాగంగా వరి పంటలో మేలైన వ్యవసాయ పద్ధతులు, పొట్టదశలో ఆశించే చీడపీడలు, వాటి నివారణా చర్యలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎంవి శ్రీనివాసరావు వివరించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు రైతులకు పొలంబడి లో భాగమైన వ్యవసాయ పర్యావరణ విశ్లేషణా పద్ధతిని , పొలంలో మిత్ర , శత్రు పురుగుల నిష్పత్తిని వివరించారు. కార్యక్రమాన్ని రాకోడు గ్రామ ఎంపిటిసి సభ్యులు వేచలపు శ్రీనివాస్ రావు ప్రారంభించారు. కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారులు సూరిబాబు, శోభ,వినయ్, ప్రకృతి వసాయ సిబ్బంది రంధి రమణ, సన్యాసమ్మ , రాకోడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

118వ రోజుకు జిందాల్ నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ కోసం సేకరించిన తమ భూములను తిరిగి ఇవ్వాలని మండలంలోని బొడ్డవరలో నిర్వాసితులు చేపట్టిన నిరసన గురువారం 118వ రోజుకు చేరింది. వెంటనే అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని తెట్టంగి, కొండగండ్రేడు ఆర్‌అండ్‌బి రోడ్డులో తెట్టంగి పంటపొలాలు దగ్గరలో కరెంట్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఘటనలో తడేలా అచ్చుతరావు (35) మృతి చెందగా మరొకరికి బలమైన గాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్తే.. పెనుబర్తి గ్రామానికి చెందిన తడేలా అచ్చుతరావు, గుషిణి నారాయణ రావు, తడేలా కృష్ణలు తమ వ్యక్తి గత పనులు నిమిత్తం ఒకే మోటారు బైక్‌పై దేవునికనపాక వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో తెట్టంగి పొలాలు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న తడేలా అచ్చుతురావు ఘటన స్థలం వద్దే మృతి చెందగా గాయాలు పాలైన గుషిణి నారాయణరావును చికిత్స నిమిత్తం 108లో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కృష్ణకు పెద్దగా గాయాలు కాలేదు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నెల్లిమర్ల : స్థానిక చంపావతి నదిలో గల్లంతైన కనకల అప్పారావు (46) మృతదేహం గురువారం లభ్యమైంది. జరజాపుపేటకు చెందిన మృతుడు కనకల అప్పారావు థామస్ పేట వద్ద చంపావతి నదిలో బుధవారం స్నానానికి దిగి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గల్లంతైన విషయం తెలిసిందే. ఎన్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా కొండ పేట వెళ్లే రహదారి జ్యూట్ మిల్ వద్ద మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి పంచనామా జరిపి పోస్టుమార్టానికి విజయనగరం తరలించారు.

3 తులాల బంగారం చోరీ

గజపతినగరం : మండలంలో సాలిపేట గ్రామంలో సుమారు మూడు తులాల బంగారం చోరీ అయింది. ఆ గ్రామానికి చెందిన రొంగలి శంకర్రావు బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లాడు. పొలం పనులు ముగించుకుని ఆయన భార్య ఇంటికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించింది. బీరువా తలుపులు బద్దలు కొట్టి అందులో ఉన్న సుమారు మూడు తులాల బంగారం చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

ఆహార వృథాను అరికడదాం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆహార విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆహార వృథాను అరికట్టవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు అన్నారు. ప్రపంచ ఆహార భద్రత దినోత్సవ నేపథ్యంలో గురువారం కారుణ్య కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ఆహారం లేక అల్లాడిపోతుంటే మరోవైపు అధిక మొత్తంలో ఆహారం చెత్తబుట్ట పాలవుతుందన్నారు. వేడుకల్లో, హోటళ్లలో, రెస్టారెంట్లలో ఆహారం వృథా అవుతుందన్నారు. మెరుగైన ఆహారం, మెరుగైన భవిష్యత్ కోసం చేయి చేయి కలుపుదాం అన్న నినాదంతో ఆహార వృథాను అరికట్టేందుకు నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో కారుణ్య చీఫ్ ట్రస్టీ పివిఎ మెర్సీ రాజ్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సభ్యులు రామకృష్ణ, అశోక్, చిన్నారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం మంజూరు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని దత్తి గ్రామంలో ఈనెల 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామానికి చెందిన పొట్నూరి అప్పలరాజుకు ఇంటి స్థలం తో పాటు ఇల్లు కట్టి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో గురువారం హౌసింగ్ పీడీ మురళి దత్తి గ్రామానికి వచ్చి లబ్ది దారుని పేరు మీద ఇల్లు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఆయనకు ఇల్లు కట్టేసి ఇస్తామన్నారు, కార్యక్రమంలో తాహశీల్దార్ విజయభాస్కర్, హౌసింగ్ డిఇ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

నేటి నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తామని ఎంఇఒ ఎం.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ ఈ క్రీడా పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ, చెస్ తదితర రంగాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డివిజన్ స్థాయికి, డివిజన్ స్థాయిలో రాణించిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి నాగమణి

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ సచివాల యంలో యూత్ క్లబ్ బెజ్జిపురం ఎన్‌జిఒ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పథకాలపై అవగాహన, అనుసంధాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ స్థాయిలో ప్రజలందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న పథకాలు వాటికి గల అర్హతలు దరఖాస్తు చేసుకునే విధానంపై వివిధ శాఖల నుండి హాజరైన అధికారులతో వివరంగా అవగాహన కల్పించారు. జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఈ శ్రమ కార్డ్స్ లేబర్ ఐడి, ఇతర ఇన్సూరెన్సులు గూర్చి వాటిని దరఖాస్తు చేసుకునే విధానం గూర్చి వివరించారు. ఐసిడిఎస్ వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి నాగమణి, గ్రామపంచాయతీ సెక్రటరీ రాంజీరావు, ఎపిఎం ఎస్.సురేష్ కుమార్, ఆయుష్ వైద్యులు డాక్టర్ సుమలత, యూత్ క్లబ్ బజ్జిపురం ఎన్‌జిఒ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ జి.ఝాన్సీ, కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ సిహెచ్‌వి నారాయణమ్మ, సిహెచ్ పద్మ, సర్పంచ్ రేవల్ల శ్రీనివాస్, టిడిపి నాయకులు కోరాడ శ్రీను, జనసేన నాయకులు చింతపల్లి శ్రీనివాసరావు, నల్లిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మామిడితోటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్

అంతర పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి-వేపాడ

ఉద్యాన పంటల్లో అంతర పంటల సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్ తెలిపారు. వేపాడ మండలంలో కుమ్మపల్లి గ్రామంలో మామిడి తోటలు, ఉద్యాన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం మామిడిలో వరి, అపరాలు, రాగి, కూరగాయల పంటలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటతోపాటు ఇతర పంట ద్వారా ఆదాయం రావడం వల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. రైతు ఆర్థిక అభివృద్ధి చెందడానికి ఇది మంచి మార్గమని చెప్పారు. 365 రోజులూ పంటలు వేయడం వల్ల భూమి పోషకాలతో ఉండి, ప్రధాన పంటకు కావలసిన పోషకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ వరప్రసాద్, ఎంటి సన్యాసమ్మ, యూనిట్ ఇన్‌ఛార్జి నారాయణమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 60 లక్షలతో శ్మశాన వాటిక నిర్మాణం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలసలో రూ.60 లక్షల మండల పరిషత్ నిధులతో శ్మశాన వాటిక నిర్మాణం జరుగుతుందని ఎంపిపి మహంతి కళ్యాణి తెలిపారు. గురువారం నిర్మాణం జరుగుతున్న శ్మశాన వాటికను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెల్లివలస చల్లవాని తోట పరిధిలో గల ప్రజలకు అవసరార్థం నిర్మాణం చేపడుతున్నామని, గతంలో ఎవరైనా చనిపోతే వర్షాకాలంలో అంతిమ సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడేవారని, అంతిమ సంస్కారం గౌరవంగా జరపాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్మాణం చేపట్టమని చెప్పారు. బర్నింగ్ షెడ్డు పనులు పూర్తయ్యాయని, ప్రాంగణంలో టైల్స్ నిర్మాణం తదితర పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభిస్తామని చెప్పారు.

జిల్లా సైన్స్ సెమినార్‌కు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - చీపురుపల్లి

మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ సెమినార్ పోటీలలో చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన జి.ఆదిత్యవర్ధన్, పి.తనిష్కలు జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు. ఈనెల 27న జిల్లాస్థాయిలో జరగనున్న సైన్స్ సెమినార్ పోటీలలో వీరు పాల్గొంటారని ఎంఇఒలు బూసినాయుడు, విజయ్ కుమార్‌లు తెలిపారు. మండల స్థాయి సెమినార్ పోటీలకు న్యాయ నిర్ణేతులుగా గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లెక్చరర్ ఎస్.వెంకటలక్ష్మి, పాలవలస ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణలు వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది విద్యాశాఖ అధికారులు అభినందించారు.

సైన్స్ సెమినార్‌లో ప్రథమ స్థానం

నెల్లిమర్ల : జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం. లాస్య పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ సెమినార్‌లో 'క్వాంటం యుగం ప్రారంభం - అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై ప్రసంగించి మొదటి బహుమతి సాధించింది. న్యాయ నిర్ణేతలుగా మండల విద్యాశాఖాధికారులు, క్లస్టర్ హెచ్‌ఎంలు, మహాత్మా గాంధీ - జ్యోతిబా పూలే హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు వ్యవహరించారు. హెచ్‌ఎం ఎస్. కామేశ్వరి లాస్యను అభినందించారు.

మండల స్థాయి సైన్స్ సెమినార్

వేపాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ సెమినార్‌ను హెచ్‌ఎం ఎన్.కృష్ణస్వామి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ పి.బాల భాస్కరరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు తరాలకు మేలైన సాంకేతికతను అందించే శాస్త్రవేత్తలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో హాజరుకావాలని సూచించారు.

సేవ్ ది గర్ల్ చైల్డ్‌పై అవగాహన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సేవ్‌ది గర్ల్ చైల్డ్ పై అవగాహన కార్యక్రమం గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి మాట్లాడుతూ ఆడపిల్లల భ్రూణహత్యలు, లైంగిక హింస, లింగ వివక్షతకు అడ్డుకట్ట వేయడానికి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని సూచించారు. బాలికలకు సమాన హక్కులు, విద్యా అవకాశాలు కల్పించాలన్నారు. స్త్రీలపై హింస, బాల్య వివాహాలు నివారిం చేందుకు చట్టాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్

కంటోన్మెంట్ : నగరంలోని అద్దేపల్లి వారి వీధికి చెందిన రాధ ఇంట్లో ఈనెల 7న జరిగిన దొంగతనం కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ ఎస్ కృష్ణమూర్తి తెలిపారు. సిహెచ్ మంగరాజు, అప్పన్నబాబు, జి పైడ్రాజు తలుపుకున్న తాళం విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడ్డారని తెలిపారు. 1339 గ్రాముల వెండి వస్తువులు, రోల్డ్ గోల్డ్ ఆభరణాలు, టివి, మోటారు దొంగిలించాలని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వస్తువులను రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి - సీతానగరం

ఉల్లాస్ అక్షర ఆంధ్ర లక్ష్యాలను నెరవేర్చి అందరి వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో విద్యావాలంటీర్లు కీలకపాత్ర పోషించాలని ఎంపిడిఓ ఎంఎల్ఎస్ ప్రసాద్, ఎపిఎం భారతి పిలుపునిచ్చారు. మొదటి విడతగా 240మంది వాలంటీర్లకు ఐకెపి, మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం రెండో రోజు శిక్షణ సందర్భంగా వారికి పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపిడిఒ, ఎపిఎం మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ అక్షర ఆంధ్రలక్ష్యాలను నెరవేర్చడంలో వాలంటీర్లదే కీలక పాత్ర పోషించాలన్నారు. ఈనెల 27 నుంచి మీకు మ్యాపింగ్ చేయబడిన నిరక్షరాస్యులను వందరోజుల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఐ బాలకృష్ణ, వెలుగు సిసిలు సమ్మెక్క సభ్యులు వాలంటీర్లు పాల్గొన్నారు.



వాలంటీర్లకు పుస్తకాలను అందిస్తున్న ఎంపిడిఒ

వేతనాల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఇంత వరకు వేతనాలు అందలేదని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ప్రసాదరావు, రాము, వెంకట్, లక్ష్మణ, తదితరులు గురువారం విలేకరుల వద్ద వాపోయారు. పనులు చేసినప్పటికీ నెలల తరబడి వేతనాలందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కష్టపడి కూలీలకు వేతనాలు అందించలేదని ఉపాధి అధికారుల నిర్లక్ష్యమే ఇలా జరిగిందని, వేతన దారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని వేతన దారులు కోరుతున్నారు.

ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన యువత శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కెవికె శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు అన్నారు. గురువారం మండలంలో కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన యువతకు జీడి మామిడి, పనస, సపోటాలో అంటుకట్టు విధానం, పోట్రేళ్లు నారు పెంపకం, టమాటా అంటు మొక్కలు జీడి పంటల్లో అంతర పంటల గురించి శిక్షణ ఇచ్చి నైపుణ్యత అభివృద్ధి సాధించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, గిరిజన యువత పాల్గొన్నారు.

ఆలయం ఎదుటే మద్యం సీసాలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో కోట దుర్గ ఆలయం ఎదురుగా మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో బోరు దగ్గర సీసాలు ఉండడంతో పలువురు ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఆలయం దగ్గర ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయా అంటూ పలువురులో చర్చ మొదలైంది. దీనిపైన దేవాదాయ శాఖ, పోలీసులు కూడా దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కరి శ్రీను తండ్రి సత్యం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం వారి ఇంటికెళ్లి పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ ఏఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దోల్లు కిషోర్, బిజెపి జిల్లా జనరల్ సెక్రెటరీ నిమ్మక భాస్కరరావు, మాజీ ఎంపిటిసి మండంగి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అంటిపేట, పనుకుపేటలో గ్రామసభలు

పజాశక్తి - సీతానగరం

మండలంలోని పణుకుపేట, అంటిపేట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సామాజిక బృందం తనిఖీలు నిర్వహించి గ్రామసభలో ఆ గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దల సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందానికి జాబ్ కార్డుల లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మస్తర్లు, కొలతల్లో తేడాలున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అంబటి కృష్ణంనాయుడు, మాజీ సర్పంచ్ పైన నాగభూషణం, సర్పంచ్ బొంగు తిరుపతిరావు, పిఎసిఎ అధ్యక్షులు యోగి రెడ్డి భాస్కరరావు, ఎంపిటిసి చలపతి, నిర్మల, బిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఎస్ఆర్‌పి రామచంద్రరావు, డిఆర్‌పి ఎం.నరేష్, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరుకు చెందిన తాడిఅశోక్‌కు రూ.89,928, చిట్టపూడి వలసకు చెందిన మోనంగి కౌశిక్‌కు రూ.42 వేలు సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తన క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం గనుక ప్రజల కోసం పనిచేస్తుందని, వీటిని వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, చింతా ఉమామహేశ్వరరావు, జనసేన జానీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత

కురుపాం: విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే కాకుండా వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డిఐఇఒ వై.నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల పరిసర ప్రాంతాలను, వసతులను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి, సిబ్బందికి విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు అందించారు.

పురోహితునివలసలో ఉచిత వైద్య శిబిరం

సాలూరు : మండలంలోని పురోహితునివలసలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిహాల్ ఆసుపత్రి వైద్యులు బంకురు అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మంది రోగులకు ఉచితంగా మందులు, రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తినే విధంగా ఉండాలని ఎటువంటి సమస్యలు వచ్చినా మూఢనమ్మకాలను నమ్మకుండా వైద్యులను సంప్రదించి తగు వైద్య సలహాలు తీసుకొని మందులను తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ సర్పంచ్ బంకురు తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

13 గంటల పనితో శ్రమ దోపిడీ

బొబ్బిలి : కార్మికుల శ్రమ దోపిడీ చేసేందుకే రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం రోజుకు 13 గంటల పనివిధానం తీసుకొస్తోందని ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు డి.వెంకటరమణ, టి.అప్పలనాయుడు విమర్శించారు. పట్టణంలోని గంటి ప్రసాదం భవనంలో గురువారం 13 గంటల పని విధానానికి వ్యతిరేకంగా జరిగే నిరసన పోస్టర్లను విడుదల చేశారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

దృష్టి దోషాలు రాకుండా జాగ్రత్త

రామభద్రపురం : దృష్టి దోషాలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకొని కంటి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని పిరిడి పిహెచ్‌సి కంటి వైద్య నిపుణులు సునీత విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో కంటి సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రాథమిక కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జెసి రాజు, ఆశా వర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

మద్యం నాణ్యత తనిఖీకి మొబైల్ యాప్

గుమ్మలక్ష్మీపురం : ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం కొనుగోలు చేసుకోవచ్చుని ఎవరు కూడా ఎటువంటి అపోహలు లేకుండా నాణ్యమైన మద్యాన్ని పొందవచ్చునని కురుపాం ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గుమ్మలక్ష్మీపురం వైన్ షాపును ఆకస్మికంగా పరిశీలించారు. షాపులో ఉన్న మద్యం బాటిల్ పరిశీలించి క్యూఆర్ కోడ్ తో పరిశీలన చేశారు. యాప్ ద్వారా స్కాన్ చేసి మాత్రమే అమ్మకాలు చేయాలని, నాణ్యతకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే 6302936599కు ఫిర్యాదు చేయాలని సిఐ కోరారు.

వ్యర్థాల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎట్టకేలకు పట్టణ శివారులో గల డంపింగ్ యార్డ్‌లో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించి, మిషనరీల ద్వారా వేరు చేసే ప్రక్రియ ప్రారంభమవుతుంది. 15ఏళ్లుగా పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలు పేరుకుపోవడంతో, డంపింగ్‌యార్డ్‌ను వేరే ప్రాంతానికి తరలించ చేయడకు అటు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నాలు చేసి, లక్షలాది రూపాయలు నిధులను ఖర్చుపెట్టినప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదని చెప్పవచ్చు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌లో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ స్వచ్ఛ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ఈ డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క అడుగు ముందుకు వేసి విశాఖపట్నంకు చెందిన తరుణి అసోసియేట్స్‌తో గత ఏడాది ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా గత ఏడాది


మిషనరీ పరికరాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అక్టోబర్ 17న మున్సిపల్ ప్రత్యేక అధికారిగా విజయనగరం కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, పబ్లిక్ హెల్త్ ఇఇ జ్యోతి డంపింగ్ యార్డ్‌లో పేరుకు పోయిన వ్యర్థాలను పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన 12 వేల టన్నుల వ్యర్థాల తొలగింపునకు ఒప్పందం జరిగిందని, ఈ తొలగింపు పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పి ఏడాదైనా వ్యర్థాలు తొలగింపు ప్రక్రియ జరగలేదు. ఏడాది తర్వాత తొలగింపునకు సంబంధించి ఎట్టకేలకు డంపింగ్ యార్డ్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ లేఅవుట్‌లో మిషనరీ పరికరాలను సంబంధిత సంస్థ ఏర్పాటు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ వ్యర్థాలు నుంచి సోయిల్, ఇనెర్ట్,ఆర్ డి ఎఫ్(పాలిథిన్ వ్యర్థాలు),సి ఎన్ డి స్టోన్‌లను వేరుచేసే ప్రక్రియ జరుగుతుందని ధరణి అసోసియేట్స్ నిర్వాహకులు చెబుతున్నారు. మొత్తానికి డంపింగ్ యార్డ్ లో దశాబ్ద కాలంగా పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపునకు అడుగులు పడుతుండడంతో పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - భామిని

వైద్య కళాశాలలు 100శాతం ప్రభుత్వం చేతిలో ఉంటేనే సామాన్యుడికి వైద్యం, సామాన్య కుటుంబం నుంచి వైద్యులు తయారవుతారని ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం అన్నారు. భామినిలో మండల వైసిపి అధ్యక్షులు బి.శ్రీను ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో, వైద్యం ఎల్లప్పుడూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని, అప్పుడే సామాన్యుడికి ఆరోగ్య సేవలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, సానుభూతిపరులు, యువకులు పాల్గొని సంతకాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగట్టి ధర్మారావు, కొత్తకోట చంద్రశేఖర్, కోతల మజ్జి, కొల రామారావు, పోతల హరికృష్ణ, గేదెల మోహన్ రావు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న పిఒ సుగుణకుమారి

హక్కులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

బాలికల రక్షణ కోసం ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులను చట్టాలను వినియోగించుకునే విధంగా అవగాహన కలిగి ఉండాలని కొమరాడ ప్రాజెక్టు ఐసిడిఎస్ పిఒ జి.సుగుణ కుమారి అన్నారు. గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సం సందర్భంగా మండలంలో కేజీబీవీ, కోటిపాం పాఠశాల, మండల గురుకుల విద్యాలయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహారం, ప్రభుత్వం బాలికల రక్షణ కోసం కల్పిస్తున్న హక్కులను వివరించి వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉండాలంటే బాలికలు తీసుకోవాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తూ వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్ నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శారదంబ, బంగారమ్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ, కౌన్సిలర్ తవిటినాయుడు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే స్మార్ట్ కార్డులు

ప్రజాశక్తి - వీరఘట్టం

అక్రమ దారులకు అడ్డుకట్ట వేసేందుకే కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన చేతులు మీదుగా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని అందులో భాగంగా మండలంలో 19,500 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. చౌక ధరల దుకాణం ద్వారా రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా పారదర్శకంగా పంపిణీ చేయడానికి స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా స్మార్ట్ రేషన్ కార్డులు ద్వారా సరుకులు పొందవచ్చు అన్నారు. అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ ఎస్‌పి జగన్నాథ్, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎం.బాల సరస్వతి, తహశీల్దార్ ఎఎస్‌కామేశ్వరరావు, కూటమి నాయకులు పి. కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్ళబాబు,చింత ఉమామహేశ్వ రరావు, శశి కుమార్, ఏ.కుమార స్వామి, ఎం. వెంకట రమణ, వై.శ్రీనివాసరావు, బి.నీలకంఠం నాయుడు, జనసేన జానీ, ఎం.పుండరకం, ఎస్.అచ్యుతరావు, కె.సాయి పవన్, కె.లక్ష్మణ్, ఎం.వెంకటరమణ, ఎస్ఎస్ భూషణ్‌రావు బి.అశోక్, పైడిరాజు, రాజ్ కుమార్, చంద్రశేఖర్, విఆర్ఒలు, డీలర్లు, పాల్గొన్నారు.

కొటియా గ్రామాల్లో స్మార్ట్ కార్డులు పంపిణీ

సాలూరు: మండలంలోని గంజాయి భద్ర పంచాయతీలో ఉన్న 13 గ్రామాలకు, సారిక పంచాయతీలోనున్న 14 గ్రామాలకు రెండు సచివాలయాల సిబ్బందితో కలిసి గురువారం లబ్దిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భందా పంచాయతీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి సంక్షేమ అభివృద్ధి పథకాన్ని గిరిజనులకు అందించడానికి సాయిశక్తులా కృషి చేస్తున్నామన్నారు. దీనికోసం స్థానిక అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను కలుపుకొని వెళుతూ వారికి అందవలసిన అన్ని పథకాలనూ సక్రమంగా అందిస్తున్నామన్నారు.


వీరఘట్టం: స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గురుగుబిల్లి: మండల పరిధిలోని సంతోషపురంలో స్మార్ట్ కార్డులను సర్పంచ్ అంబటి తవిటినాయుడు (రాంబాబు) గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన ఆయన మాట్లాడుతూ పౌరసర ఫరాల వ్యవస్థలో పారదర్శకంగా ఉండేందుకు క్యూ ఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేసిందన్నారు. యడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డుల వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వ్యకాస మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సాలూరు

ఈనెల 22న పార్వతీపురంలో జరుగు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 10వ జిల్లా మహాసభలు జరగనున్నాయని వాటిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. గురువారం సాలూరులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లల్లో పేదలు గిరిజనుల పక్షాన వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు నిర్వహించిందని, ప్రధానంగా భూ సమస్యలపై, ఉపాధి, మైనింగ్ తదితర సమస్యలపై కృషి చేసిందని గుర్తు చేశారు. ఈ మూడేళ్లలో జరిగిన పోరాటాలు ఫలితాలను సమీక్షించుకొని వచ్చే మూడేళ్లకు పోరాటాలు, కార్యక్రమాలను ఈ సభలో రూపొందించు కుంటామని చెప్పారు. జిల్లాలో సంఘం ఆధ్వర్యంలో అనేక భూ పోరాటాలు నడిచాయని దీనికి ప్రతిఫలంగా పేదలు గిరిజనులు భూములు సాధించుకున్నారని, ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని కూలీలు సమస్యలు పరిష్కారం చేయాలని అనేక పోరాటాలు నిర్వహించి కూలీలకు అండదండగా ఉన్నామని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 22వ తేదీన పార్వతీపురంలో జరిగే జిల్లా మహాసభలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు, బొంగ కృష్ణ, బూరాడ ఈశ్వరరావు, సింగారపు శ్రీను, చలంబారికి సింహాచలం, లింగాల బంగారి, అంతికాపల్లి చంటి, కుప్పిలి వెంకట్రావు, డర్రు బంగారి తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రహదారి సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కాలనీలో విద్యుత్ స్తంభాలు, రహదారి సౌకర్యం కల్పించాలని, పట్టణ పరిధిలో వెంకటేశ్వర కాలనీవాసులు మున్సిపల్ ఎఫ్ఎసి కమిషనర్ జి.శ్రీనివాస రాజుతో అన్నారు. గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ బి.జయ ప్రకాష్ నారాయణ, టిడిపి నాయకులు సారిక గణేష్‌లతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ వెలసి నాలుగేళ్లు కావస్తున్నా ఇంత వరకు విద్యుత్ స్తంభాలు, రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారని, రాత్రి వేళల్లో విష సర్పాల సంచారం వల్ల ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని, కాలనీలో ఉన్న చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయపడుతున్నారని చెప్పారు. ఈ సమస్యను ఏడాది క్రితం మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఇంత వరకు సౌకర్యాలు కల్పించలేదని తక్షణమే ఈ కాలనీలో విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ చైతన్య స్కూల్ రహదారిలో కూడా విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ కాలనీ వాసులు గౌరీ శంకర్రావు, బి.కృష్ణ, ప్రసాదు, రమణ, మాజీ కౌన్సిలర్ మంచిపల్లి సత్యనారాయణ, పాల్గొన్నారు.


కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం : డిఎస్ఒ

వీరఘట్టం: జిల్లాలోని ఈ ఏడాది 180 కొనుగోలు కేంద్రాల నుండి 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా సివిల్ సప్లై అధికారి ఎం.బాల సరస్వతి తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు 104 రైస్ మిల్లులు అనుసంధానం చేశామన్నారు.

చెకుముకి సంబరాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -వీరఘట్టం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు ప్రతిభ పరీక్షను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ మహేశ్వరరావు, కె.గౌర్నాయుడు, జిల్లా చెకుముకి సబ్ కమిటీ కన్వీనర్ ఆర్.ధనుంజయనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8,9,10 తరగతుల విద్యార్థులు రాసే ఈ సైన్స్ ప్రతిభ పరీక్ష ఈనెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లాస్థాయి పరీక్షలు నిర్వహించనున్నామని, డిసెంబర్ 12,13,14 తేదీల్లో రాష్ట్రస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలు ఉంటాయని వారు తెలిపారు.


మురుగు నీరు తొలగించిన తరువాత వీధి పరిస్థితి

వరద నీరు తొలగింపు

'ప్రజాశక్తి ' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పాచిపెంట

రెండు, మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలు స్థానిక ఆరోగ్య కేంద్రం దారిని వరద నీరుతో ముంచేసింది, దీంతో రోగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే ముడుకుడు నీటిలోంచి వెళ్లి నరకయాతన పడుతున్నారు. ఈ నేపథ్యంలో పిహెచ్‌సికి వెళ్లాలంటే నరకమే శీర్షిక మంగళవారం 'ప్రజాశక్తి' లో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిలో నిల్వ ఉన్న మురుగునీటిని మోటార్‌తో తొలగించి రోగులకు ఇబ్బంది లేకుండా బాగు చేశారు.

బకాయి బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకానికి సంబంధించి బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలని సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా మెస్ బిల్లులు జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు, జీతాలు చెల్లించాలన్నారు. కార్మికులపై రాజకీయ వేదింపులు ఆపాలని, ప్రమాద బీమా సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కె. సరోజిని, వెంకట పద్మావతి, లెంక సీతమ్మ తదితరులు పాల్గొన్నారు

రాజ్యాంగ దినోత్సవ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

భారత రాజ్యాంగ దినోత్సవం జయప్రదం చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ నాయకులు బివి రమణ పిలుపునిచ్చారు. గురువారం ఆయన చంద్రంపేట పరిధి ఎల్ఎన్‌పురంలో దళితవాడలో పర్యటించి భారత రాజ్యాంగ దినోత్సవం జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 26న నెల్లిమర్లలో భారత రాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు వంద డప్పులు, వేయి గొంతులు కార్యక్రమం ద్వారా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మలాట రాము, దివకాల సంతోష్, సింహాద్రి, సూరిబాబు, పాల్గొన్నారు.

ముగిసిన పోషణ మాసోత్సవాలు

ప్రజాశక్తి- సాలూరు

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గత నెల 17 నుండి ఈ నెల 16 వరకూ సాలూరులో జరిగిన జరిగిన ఎనిమిదవ రాష్ట్ర పోషణ మాసోత్సవాల కార్యక్రమాలు ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని సాలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కె.మంగమ్మ ఆధ్వర్యంలో గురువారం వైటీసీ భవనంలో పట్టణ, మండల అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది ప్రతి గ్రామంలో శిశు పోషణ గురించి ప్రజలకు సరైన అవగాహన కల్పించే విధంగా పిల్లల ఆహారపు అలవాట్లపై శ్రద్ధ వహించడం వల్ల స్థూలకాయం, చక్కెర వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. పిల్లలకు సరైన ఆహారం, సరైన పద్ధతుల్లో, సరైన సమయానికి అందిస్తేనే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని అన్నారు. టాటా ట్రస్ట్ డిసిఒ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు పిల్లల ఎత్తులు, బరువులు చూసి, వారి ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు చేసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం వైటీసీలో ఉన్న ఐదుగురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అనురాధ, విజయలక్ష్మి, లీలావతి, ధనలక్ష్మి, లక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.


గర్భిణులను ఆశీర్వదిస్తున్న వైద్యులు

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

బకాయి వేతనాలు చెల్లించి, మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ గురువారం స్థానిక మండల పరిషత కార్యాలయం వద్ద క్లాప్ మిత్రలు, గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మలమన్మధరావు, ఆ సంఘం కార్యదర్శి పృధ్వీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడిన గ్రీన్ అంబాసి డర్లు పట్ల ప్రభుత్వ అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. గత ప్రభుత్వం మాది రిగానే ఈ ప్రభుత్వం నెలలు తరబడి వేతనాలు బకా యిలు పెడితే తమ కుటుంబాలను ఎలా పోషించుకో వాలని ఆవేదన వ్యక్తం చేశారు, గ్లౌజులు, సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు లాంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ అలవెన్స్ రూ.4వేలు అమలు చేయాలని, రిక్షా మరమ్మతులు సొంత ఖర్చులతో గ్రీన్ అంబాసిడర్లు చేయించుకుంటున్నారన్నారు. కనీసం పంచాయతీ సెక్రటరీలు బిల్లులు కూడా మరమ్మతులకు చెల్లించడం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. అనంతరం ఎంపిడిఒకు, డిప్యూటీ ఎంపిడిఒలకు వినతి పత్రం అందజేశారు. సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని పంచాయతీ సెక్రటరీలకు, గ్రీన్ అంబాసిడర్లకు జాయింట్ మీటింగ్ వేస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు పి.భాను మూర్తి, శ్రీను, ఫకీరు, ప్రసాదు, సోములు, మరియమ్మ, సంగమేశు, మేరీ, పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ సెమినార్‌లో స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో పదవతరగతి చదువుతున్న నెల్లి శ్రీనిది మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీస్థానం ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి పి.నవీన్‌కుమార్ సాదించారు. మండల స్థాయిలో ప్రథమ స్థాయి సాదించిన శ్రీనిదిని జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌కు శుక్రవారం పార్వతీపురం పంపను న్నట్లు ఎంఇఒ ఎన్.సత్యనారాయణ తెలిపారు. విజేతలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



కురుపాం: శ్రీనిధిని అభినందిస్తున్న టీచర్లు

జిల్లా స్థాయి సెమినార్‌కు ఎంపిక

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర)లో గురువారం ఎంఇఒలు డి.గౌర్నాయుడు, ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో క్వాంటం యుగం ఆరంభం, అవకాశాలు, పరిమి తులు టాపిక్‌కి సంబంధించి మండల స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహించారు. మండలంలోని కత్తులకవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి చైతన్య ప్రథమ స్థానంలో నిలిచారు. పివిఆర్‌పురం ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన పి.షర్మిల ద్వితీయ స్థానం సాధించడంతో గైడెన్స్ ఉపాధ్యాయులు జి జేమ్స్ కుమార్, ఎం సంపత్ కుమార్‌లకు అభినం దనలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 17వ తేదీన జిల్లా కేంద్రంలోని జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలకు ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రత్నాకర్, బి. సుంబోరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వీరఘట్టం: ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఏరియా ఆసుపత్రి సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిని గురువారం ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి సందర్శించారు. రోగుల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వరాలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమెతో పాటు మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.